# మారిన మనిషి

శ్రీ ఎస్. చంద్రశేఖర్

(గత సంచిక తరువాయి)

ఈ మాట వినేసరికి కన్యాలాల్‌కు మూర్ఛవచ్చినంతపనైంది. గొంతుకలో పచ్చివెలక్కాయ పడినంత పనైంది. అతని దగ్గర ప్రస్తుతం డబ్బులేదు. ఏమీతోచడం లేదు. ఏమైతే అయిందని–

"నేను మీ డబ్బు తర్వాత యిస్తాను, ప్రస్తుతం నా దగ్గరలేదు" అన్నాడు ఎట్లాగో.

"వీల్లేదు నాకిప్పుడేకావాలి, యిప్పుడంటే తక్షణమే కావాలి" అని ఉరిమాడు గోవిందలాల్.

రుక్మిణమ్మకు ఉక్రోషం పొంగిపొర్లింది. "దొంగవెధవా ? నీకు సిగ్గులేదూ. తీయని మాటలుచెప్పి మా దగ్గర డబ్బుతీసుకొన్నప్పుడు బాగుందేం! యివ్వమన్నప్పుడు నీ దగ్గరలేదు' మమ్మల్ని మోసంచేద్దామనుకొన్నావా! ఛీ! కుక్కా! ఛీ! ఛీ కుక్కలకొడకా! నీ దంతా కుక్కజాతిరా! మేం యిచ్చిన డబ్బు యిచ్చేయ్" అంటూ నోటికివచ్చినట్లల్లా తిట్టింది. జరిగిన పరాభవానికి ఆమెకు ఏడుపు పొంగి పొర్లింది. అతనిమీద కోపంతీరక అతన్ని పిడికిలితో కొట్టడానికి ముందుకుపోయింది.

కన్యాలాల్‌కు తల కొట్టేసినట్లయింది. ప్రత్యక్షంగా కాబోయే అల్లునిముందు, తనకు పరాభవం జరగడం సహించలేక పోయాడు. ఆత్మాభిమానం ఉరకలుగా పొంగింది. ఇక ఉండబట్టలేక.

"ఛీ! పోవే పిచ్చిముండా!" అంటూ మీదకు వస్తున్న రుక్మిణిబాయ్‌ని క్రిందకు తోశేశాడు.

ఆ దృశ్యం చూచేసరికి గోవిందలాల్‌కు కోపం ప్రకోపించింది. తన తల్లిని, తన ఎదురుగా పరాభవించడం సహించలేక పోయాడు. ఒక సారిగా కన్యాలాల్ మీద పడి గొంతుకపట్టుకున్నాడు. యిద్దరూ పెనగులాటలోకి దిగారు. చీకటి దట్టంగా అలముకుంది. దుర్గాదాస్‌కి ఏమీచేయ డానికి తోచలేదు. కాని తనకు కాబో తున్న మామగార్ని పరాభవించడం చూడలేక ఒక దుడ్డుకర్ర తీసుకొని గోవిందలాల్ అనుకొని ముగ్గుర్ని చావబాదటం మొదలు పెట్టాడు. ఆ కొట్టడంలో ఒక దెబ్బ రుక్మిణిబాయ్ నెత్తిబద్దలుచేసేటట్లు చేసింది. ఆమె 'అయ్యో' అంటూ మెలి కలుతిరిగి పడిపోయింది. దాంతో దుర్గాదాసుకు భయంవేసింది. చేతిలో దుడ్డు కర్ర అవతలపారవేసి, ఏమీఎరగనట్లు–

"ఏంచేసావో చూడు – ఎంతపనిచేసావురా దొంగవెధవా ?" అంటూ గోవిందలాల్‌ని తిట్టటం మొదలుపెట్టాడు.

గోవిందలాల్ కన్యాలాల్‌ని వదిలి ప్రక్కనే మెలికలు తిరిగిపడిపోయిన తల్లి దగ్గరకుపోయి ఆమె తలను ఒళ్లో పెట్టుకొని,

"అమ్మా ... అమ్మా!" అని పిలిచాడు. కాని ఆమె పలకలేదు.

"అమ్మా ... " అని మరోసారి పిలిచాడు కాని ప్రయోజనం శూన్యం. అప్పటికే ఆమె ప్రాణం అనంతవాయువుల్లో లీనమైపోయింది. గోవిందలాల్ ఆమె చనిపోయిందని తెలుసుకొని బోరున ఏడ్చాడు. ఆ గొడవకు నలుగురూ చుట్టుమూగారు. దుర్గాదాస్ అదే సమయమన్నట్లు,

"చూడండి! వీడికి మతిభ్రమణంకలిగి తల్లినే ఎట్లా చంపుకున్నాడో" అంటూ ప్రచారంచేయడం మొదలు పెట్టాడు. గోవిందలాల్‌కు అవన్నీ చెవికెక్కలేదు.

కొంత సేపటికి పోలీసులుకూడా ఆ స్థలానికి ప్రత్యక్షమైయ్యారు. గోవిందలాల్ వారికి ఏమీ సంజాయిషీ చెప్పలేదు.

దుర్గాదాస్ కలుగజేసుకొని "ఆ తల్లీ కొడుకులు ఏదో వాదించుకొంటూ మా దగ్గరకు తీర్పుకొచ్చారు. గోవిందలాల్ కోపంపట్టలేక దుడ్డుకర్రపుచ్చుకొని తల పగలకొట్టాడు. తర్వాత కన్యాలాల్ మీదకూడా ఏదోకోపం మీద, మీద పడబోయాడు. అంతలో నలుగురూ వచ్చారు. వాళ్ళను చూచి యీవిధంగా దొంగ ఏడ్పుఏడుస్తున్నా"డని చెప్పాడు.

డిప్యూటీ సూపరింటెండెట్ నేరం గోవిందలాల్ మీద బలంగా మోపాడు. విచారణలోకూడా గోవిందలాల్

"తను అమ్మమీద ఎటువంటి అఘాయిత్యం తలపెట్టలేదు. తనకు కన్యాలాల్ చేసిన అన్యాయం వివరించాడు. తన తల్లి చనిపోవడానికి వాళిద్దర్లో అంటే కన్యాలాల్, దుర్గాదాసుల్లో ఎవరైంది తాను చెప్పలేనని చెప్పాడు.

దుర్గాదాస్, కన్యాలాల్ కలసి గోవిందలాల్ మీద నేరాన్నిబలంగా మోపారు. గోవిందలాల్‌తరపున వాదించడానికి వచ్చిన న్యాయవాదికూడా గోవిందలాల్‌కు అనేక విధాలుగా నచ్చచెప్పి, అతని తల్లిని ఎవరు చంపిందో చెప్పమని వత్తిడి చేసాడు. కాని గోవిందలాల్ తను కన్యాలాల్ దెబ్బలాడటంలో మునిగి పోయినట్లు తప్ప, తనతల్లి చనిపోవడానికి ఎవరు ఏ విధంగా కారకులో చెప్పలేనని చెప్పాడు. యింక న్యాయవాది ఏమీచేయలేక తనకు తోచినట్లుగా వాదించాడు. కాని ఆవాదన గోవిందలాల్‌ని నిర్దోషిగా నిరూపించలేక పోయిన ఫలితంగా పదిసంవత్సరాల కారాగారం ప్రాప్తమైంది.

♦ ♦ ♦

ఒక రోజున దిలీప్‌సింగ్ బావిదగ్గర

ఆడుకొంటుంటే అక్కడే ఒక వింతవ్యక్తి భావిలో నీళ్ళుతోడుతున్నాడు. అతని బుగ్గ మీద వికృతంగా ఓ పెద్దమచ్చ భయంకరంగా కనబడుతోంది. దిలీప్ అతని దగ్గరకు వెళ్ళి

"ఏయ్! నీదేవూరు" అని ముద్దుగా అడిగాడు.

"అన్ని వూర్లూ నావే!" అన్నాడు.

"మరి నీ సామానేది" అనడిగాడు.

"లేదు" అన్నాడు.

"మరి నీవెక్కడ పడుకొంటావు" అని మళ్లీ అడిగాడు.

"యిక్కడే" అన్నాడు ఆవ్యక్తి, ఆ చిన్నారి ముద్దుపలుకుల వింటూ.

"అయితే నేను తినే చపాతీలలో నీకూ పెడతాను, యిక్కడే వుండు" అంటూ యింటిలోకి వెళ్లి పోయాడు.

కొంతసేపటికి దిలీప్‌సింగ్ రెండు చపాతీలు దానిలో పప్పువేసుకొచ్చి ఆ వ్యక్తికిచ్చాడు.

ఆవ్యక్తి అవితింటూ దిలీప్‌తో మాట్లాడుతూ‌కూర్చున్నాడు. అంతలో ఒకస్త్రీ దిలీప్‌ను పిలిచింది.

"అమ్మ పిలుస్తుంది వెళ్తా"నంటూ వెళ్లిపోయాడు.

ఆమె దుర్గనందిని. దిలీప్ ఆమెకొడుకు. ఆమెభర్త దుర్గాదాస్. ఆలోచిస్తున్నకొలది ఆ వింతవ్యక్తి మొహం వికృతంగా మారడం మొదలు పెట్టింది.

ఆ రాత్రి దుర్గాదాస్ మంచంముందు ఒక బలిష్ఠమైన వ్యక్తి దుడ్డుకర్ర చేత్తో పట్టుకొని నిలబడ్డాడు. అతనికళ్ళు నిప్పు కణాళ్ళామండుతున్నాయ్. దుడ్డుకర్రతో దుర్గాదాస్‌ను చావబాదాలని ఎత్తాడు. కాని దిలీప్ తల్లిపక్కలో అమాయకంగా పడుకునియున్నాడు. తను ఈ రోజున దుర్గాదాస్‌ని చంపితే రేపు తండ్రిలేనివాడౌతాడు. ఒక్కసారిగా మనస్సు వికలంచెందింది. దుడ్డుకర్ర అక్కడే పడేసి చీకట్లో అంతర్ధానమైపోయాడు.

